# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర



*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# మాట

"మావయ్యగారూ, మీకిచ్చిన మాట.." ఆయన చేతులు పట్టుకుంటూ కళ్ళ నీళ్ళు పెట్టుకుంది సమత.

నిస్తేజంగా ఉన్న ఆ పెద్దాయన కళ్ళల్లోక్షణంలో సగంసేపు మెరిసిన మెరుపు ఆమె చూపును దాటిపోలేదు.

"చాలు, ఇది చాలు" అనుకుంది ఆర్తిగా. ఆయన చేతిలో బిగుస్తున్న పట్టు.

" నీ చెయ్యి తీసేసుకో సమతా!" ఎవరో నెమ్మదిగా చెప్పారు. అయిష్టంగానే వెనక్కి తీసుకుంది.

రెప్పమాటునే ఉన్నాయా జననమరణాలు! అనుకుంది "ఆయనకేం మంచివాడు! హాయిగా బ్రతికాడు, సుఖంగా వెళ్ళిపోయాడు మహరాజులా!"

" పోయినోళ్ళందరూ మంచోళ్ళా? పోయినతర్వాత మంచితనం ఆపాదిస్తారా? రేపు తనకూ అంతేనా? తను నిజంగా మంచిదా? తను పట్టు పట్టకపోయుంటే విష్ణు ఇక్కడే ఉండేవారా? మావయ్యగారు, అత్తగారు ఇంకా ఆనందంగా ఉండేవారా?

ఎవరూ జవాబు చెప్పలేని ప్రశ్నలు కాదా ఇవి?

★★★

" సమతా? నీ పేరు చాలా బావుందమ్మా!" పెళ్ళి చూపుల్లో మావగారు తనతో అన్న మొదటి మాట.

నవ్వింది తను చిన్నగా.

“నవ్వుకాదు, నిజంగానే అంటున్నాను. లక్ష్మి, పార్వతులని దాటి పేర్లు పెట్టరు మనవాళ్ళు. వాటిమీద నాకెమీ వ్యతిరేకత లేదు అనుకో” అన్నారాయన.

ఆ తర్వాత తన తల్లి తండ్రులతోటీ, తనతోటీ చాలా మాట్లాడారు. వాళ్ళ అబ్బాయి ఆఫీస్ పని మీద అమెరికా వెళ్ళాడానీ, అనుకున్న సమయానికి రాకపోతే బావుండదు కనక తామిద్దరం వచ్చామని, అతను రాగానే ఒకసారి వచ్చి కలుస్తాడు, ఇద్దరికీ నచ్చితే ఆపైన మిగతావిషయాలు మాట్లాడుకోవచ్చునని అన్నీ చెప్పారు.

" అదేంటి? ఈయన తీరు విచిత్రంగా ఉంది. వాళ్ళ అబ్బాయి అర్జంట్ గా అమెరికా వెళితే తర్వాత రావచ్చుకదా? ఇప్పుడు వీళ్ళిద్దరూ ఎందుకు రావడం?" అంది అమ్మతో సమత.

" తప్పు అలా అనకు. ముందు మాట ఇచ్చాము కదా, మానేస్తే బావుండదని వచ్చారుట. దాంట్లో అంత తప్పు పట్టడానికేముంది? చాలా మంచివాళ్ళలా ఉన్నారు" అంది అమ్మ.

చులకనగా నవ్వేసింది తను. మరో రెండు వారాల తర్వాత విష్ణు రావడం, కలవడం, ఇద్దరూ ఒకరికొకరు నచ్చడం లాంటివన్నీ చకచకా జరిగిపోయాయి.

" నాకప్పుడే తెలుసు, నువ్వు మా ఇంటి కోడలివవుతావని" అంది అత్తగారు. నవ్వింది తను. ఆవిడకి చాదస్తం, మడీ, తడీ ఎక్కువ. ఆయన దానికి పూర్తిగా వ్యతిరేకం. దేవుడు, పూజలు లాంటి వాటి పట్ల విముఖతా లేదు, శ్రద్ధా లేదు.

" ఈయనదంతా అదో రకం వ్యవహారం, నువ్వేమీ పట్టించుకోకు" అనేదావిడ.

"అమ్మా, సమతా! ఈ మంగళవారాలు, శుక్రవారాలు అవీ నీకిష్టమైతే చేసుకో, ముసలావిడ చేసుకోమందని బలవంతాన చేసుకోనక్కరలేదు. మనసులోలేనిది మంత్రం చెదివితే రాదు, అవసరం లేదు. అందుకని హాయిగా నీకెలా నచ్చితే అలా ఉండు. నలుగురూ ఏమంటారు? అనుకోనక్కరలేదు. ఆ నలుగురికీ మనగురించి ఆలోచించడం తప్ప మరేమీ పని ఉండదా?" అనేవారు ఆయన.

పుస్తకాలు చదవమని ప్రోత్సహించేవారు. తనకి ఉద్యోగం చెయ్యడం ఇష్టం లేదన్నప్పుడు

"మంచిదమ్మా, నీకెలా ఇష్టమైతే అలాగే, ఏ విషయమైనా ఎవరి నిర్ణయం వారిదిగా ఉండాలి. నీకెప్పుడైనా చెయ్యాలనిపిస్తే వెంటనే చెయ్యి." అన్నారు.

ముగ్గురు కొడుకులూ, ఒక కూతురు వారికి. సమత భర్త విష్ణు మొదటివాడు. రెండు రాజు దుబాయ్ లో ఉంటాడు. చదువుకుంటున్న మూడోవాడు చంద్ర, అందరికంటే పెద్ద అయిన అమ్మాయి సుధ ఊర్లోనే ఉంటారు.

అన్ని విషయాల్లోనూ ఎంతో విభిన్నంగా ఉండే ఆయన పిల్లల దగ్గరకొచ్చేసరికి మాత్రం చిన్నపిల్లాడిలా బెంగ పెట్టుకునేవారు.

ఊర్లో ఉన్న కూతురు రెండు రోజులకొకసారి కనబడకపోయినా, చిన్నవాడు కాలేజీనించి అరగంట ఆలస్యంగా వచ్చినా ఆరాటపడిపోయేవారు. ఈ విషయంలో ఆవిడ ఆయన్ని వెక్కిరిస్తూ ఉండేవారు.

" ప్రతీ విషయంలోనూ అభ్యుదయం, దద్దోజనం అంటూ గొప్ప కబుర్లు చెప్తారు కదా, మరి ఈ విషయానికొచ్చేసరికి ఇలా జావ కారిపోతారేం?" అంటూ ఏడిపించేది ఆవిడ.

" అవన్నీ మెదడుతోటి ఆలోచించేవి, ఇది మనసుతోటి, అదే తేడా" అనేవారు.

ప్రతీవారం దుబాయ్ నించి వచ్చెయ్యమని రెండో కొడుక్కి చెప్తూనే ఉండేవారు. ఒకరోజు అతను విసుక్కున్నాడని చిన్నబుచ్చుకుని అన్నం తినలేదు రోజంతా.

ఆ తర్వాత " వాడన్నదీ నిజమే, ఎప్పటికీ మనదగ్గరే ఉండడానికి వాళ్ళేమైనా చిన్నపిల్లలా?" అనుకుని సమాధానపడ్డారు.

సమతకి ఇదంతా కొంచం వింతగానూ, అప్పుడప్పుడు చిరాగ్గానూ ఉండేది.

" మరీ ఇలా బంధిస్తే ఎలా? ఒక స్థాయి వచ్చాకా ఎవరి ఆలోచనలు వాళ్ళవి, ఎవరి జీవితాలు వాళ్ళవి అనుకోవాలి కదా! వ్యక్తి స్వేచ్ఛకి ఎంతో ప్రాధాన్యత ఇచ్చే ఆయన ఇలా మాట్లాడతారేమిటి? " అనుకునేది.

ఆపైన ఆయన ప్రేమ కొద్దిగా ఇబ్బందిగా కనబడసాగింది. తమ మంచికోసమే చెప్పిన సలహాలు అక్కరలేని విషయాల్లో ఆయన కల్పించుకున్నట్లుగా అనిపించసాగింది.

" మీరు ఊరుకోండి, ఊరికే అన్నింట్లోనూ వేలు పెట్టకండి. వాళ్ళ విషయాలు వాళ్ళు చూసుకోగలరు కదా! " అన్న అత్తగారి మాటలు ఆయన పట్టించుకునేవారు కాదు.

అలాంటి పరిస్థితుల్లో విష్ణుకి ప్రాజెక్ట్ పని మీద మూడేళ్ళు అమెరికా వెళ్ళవలసిన అవకాశం వచ్చింది.

" సమతా! ఇదీ విషయం, నాన్న ఏమంటారో అని, నువ్వింటికి పెద్దవాడివి, నా తర్వాత నువ్వే, ఎప్పుడూ నన్నొదిలి, మన ఇంటినొదిలి వెళ్ళకు అంటారు కదా" అన్నాడు విష్ణు ఆ వార్త మొదట తనకే చెప్తూ.

అమెరికా అనగానే ఎగిరి గంతేసిన సమత ఆ రెండో మాట వినగానే కొద్దిగా నీరు కారిపోయింది. వెంటనే " ఈ రోజుల్లో కూడా ఇలా ఉంటే కష్టం కదా! రోజులతో పాటు మనం కూడా మారాలి కదా! ఆయనకంత అర్థం కాదా? ఆఫీస్ పని అని గట్టిగా చెప్పండి. అతి ప్రేమ కూడా అనర్థమే! ఒక స్థాయికొచ్చాక ప్రతీవారినీ వదిలిపెట్టాలి. లెట్ గో అనేది తెలియకపోతే ఎలా?" అంది ఉక్రోషంగా.

విష్ణు ముఖం ఎర్రబడింది చిరుకోపంతో. ఆమె మాటల వెనక అంతరార్థం అతనికి తెలియక కాదు.

" సారీ, నేనన్నది కేవలం మావయ్యగారి గురించి కాదు! మామూలుగా చెప్పాను. "అంది

"అవుననుకో! " అంటున్న విష్ణుని మధ్యలోనే ఆపి.

" అనుకో ఏవిటి? మీ తమ్ముడు దుబాయ్ వెళ్ళలేదా? చదువు పూర్తయ్యాకా చిన్నవాడు వాళ్ళదగ్గరే ఉంటాడా? మనం మాత్రం ఎందుకింత ఆలోచించాలి? అవకాశం తనంతగా వచ్చింది కదా!" అంది విసుగ్గా.

" చూద్దాం" అన్నాడు విష్ణు.

అతను ఆ విషయం ఇంట్లో చెప్పిన రోజున చిన్నపాటి  యుద్ధమే జరిగింది ఇంట్లో.

" నీ కెరీర్ కి కాని అభివృద్ధికి గానీ అడ్డుపడాలని కాదురా! నాకెందుకో పిల్లలు దూరంగా ఉంటారంటేనే భరించరానిదిగా ఉంటుంది. అందుకే చిన్నాడిని కూడా వచ్చెయ్యమని పోర్తుతూ ఉంటాను, కానీ మీరు చెప్పినదీ నిజమే, నాకోసం మిమ్మల్ని ఇక్కడే ఉండమనడం భావ్యం కాదు కదా! మీరు కనక గట్టిగా అనడం లేదు కానీ చిన్నవాడైతే నా మీద ఎగురుతూనే ఉంటాడు ఎప్పుడూ." అన్నారాయన సమాధానపడుతున్నట్టుగా.

అలా మొదలయ్యాయి అమెరికా ప్రయాణపు ఏర్పాట్లు..

" మీరేం మాట్లాడద్దన్నానా? వాళ్ళు వింటే బాధపడతారు. మీరు పెద్దకొడుకుగా మీ నాన్నదగ్గరే చివరివరకూ ఉన్నారు, బావుంది. అందరికీ అలా జరగాలంటే కుదురుతుందా?" అత్తగారు మావగారిని మందలించడం వింది సమత.

" చివరివరకూ అక్కరలేదులే, కనీసం చివరి క్షణాల్లో" ఆయన గొంతు కొద్దిగా తడవడం సమత దృష్టిని దాటిపోలేదు.

అలా వాళ్ళు వచ్చి ఇరవై ఏళ్ళవుతోంది...సమత అమెరికా వచ్చాకా ఉద్యోగంలో చేరింది. పిల్లలు, చదువులు, ఇండియా ట్రిప్ లూ. వీటిమధ్య కాలం ఎలా గడిచిపోయిందో తెలీదు. అందులో కొత్త లేదు.

కొత్తలో ఉత్సాహంగా, పిల్లలు పుట్టకా చక చకా కదిలిన రోజులు ఇప్పుడు బోర్ గా,నెమ్మదిగా గడుస్తున్నాయి.

" ఎప్పుడూ ఈ పరుగులేనా?" అన్న భావాన్ని కలిగిస్తున్నాయి. దానికి తోడు యమ స్ట్రిక్ట్ అని చెప్పుకుంటూ సాధించే కొత్త మేనేజర్.

యూనివర్సిటీకి చదువుకని వెళ్ళిన పెద్ద వాడు, హైస్కూల్లో ఉన్న చిన్నవాడు. ఏం దాచుకున్నామో, ఏం కోల్పోయామో, ఇంకా ఏం సంపాదించుకోవాలో తెలియనట్టుగా వెళ్ళిపోతున్న రోజులు..

పరుగు విసుగెత్తిన వేళ పలకరించే జ్ఞాపకాలు. ఆపుదామా, ఆపగలమా? అనిపించేవేళ గుర్తొచ్చే ఆప్తులు.. సమత ఈ విషయంలో మినహాయింపేమీ కాదు.

' మావయ్యగారూ, మీ బాధ నాకర్థం అయింది. మేము ఎక్కడున్నా ఏడాదికొకసారి తప్పక మీ దగ్గరకొస్తాము. మీరు ఎప్పుడు కావలన్న మాదగ్గరకొచ్చి ఉండచ్చు. అమెరికా కానీ, మరొకటి కాని మిమ్మల్నీ, మీ అబ్బాయినీ విడదియ్యలేదు. ఇది నా మాట" అంది వచ్చేటప్పుడు. అలాగే వెళ్ళారు వీలున్నంతవరకూ, ఆయన సంతోషం మేరకు.

అది తరచూ గుర్తొస్తోంది ఆమెకి.

" నాన్నా, అమ్మా పెద్దవాళ్ళయిపోయారు, వెళ్ళిపోదామా వెనక్కి అనుకుంటే పిల్లల చదువులు, ఇంటి మీద అప్పు" అనేవాడు విష్ణు.

" నిజమె! నాకూ అలాగే అనిపిస్తోంది, వాళ్ళకి ఎద్దైనా అయితే ఎవరు?" అనేది సమత. భయపడ్డట్టే వచ్చింది ఓ శుక్రవారం రాత్రి కబురు.

ఫోన్ చేసి శలవు అడిగే వీలు లేదు. ఫోన్ చేస్తే మేనేజర్ పలకలేదు. పిల్లాడికి పరీక్షల మధ్యలో.. వాడిని స్నేహితులకి అప్పచెప్పి బయలుదేరారు తామిద్దరూ ఆదరా బాదరాగా. ఒక మెయిల్ రాసి పంపింది మేనేజర్ కి. ఆవిడ చేసే గొడవ తను ఊహించుకోగలదు, అంతకంటే మార్గం లేదు. మహా అయితే కొత్త ఉద్యోగం వెతుక్కోవాలి అంతేగా! అనుకుంది.

" చివరివరకూ గురించి నాకు బెంగ లేదు భ్రమరం! చివరే బెంగ!" మావగారి మాటలు చెవుల్లో వినబడుతూనే ఉన్నాయి.

“తాము వెళ్తామని చెప్పగానే అంత గొడవ చేసిన ఆయన ఆ తర్వాత బాగానే ఉండేవారు. నాకన్నీ తెలుసమ్మా, ఎవరి జీవితం వాళ్ళది. నువ్వన్న మాట ప్రకారం నడుచుకుంటే చాలు: అనేవారు.

గబ గబా ఇల్లు చేరిన వారికి ఆయన పరిస్థితి చూడగానే అర్థం అయింది. ఎప్పుడూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండే మనిషి మంచానికి అతుక్కుపోయి ఉండడం చూస్తే తెలియని బాధ సుళ్ళు తిరిగింది.

" నిన్న రాత్రి గుండె నొప్పి వచ్చింది, అప్పటివరకూ బానే ఉన్నారు.ఇప్పుడు మీరు వచ్చారు కదా, తగ్గిపోతుందిలే! ఐ సీ యూ లో ఉన్న ఆయన్ని చూపిస్తూ అన్న మాటలకి కళ్ళు చెమర్చాయి సమత కి.. ప్రేమగా పెంచిన పిల్లలు గూడు వదిలి పోతే కలిగే బాధ తనకీ తెలుసు ఇప్పుడు.

★★★

"మావయ్యగారు మీకిచ్చిన మాట మేమొచ్చాం! మీరు తప్పక కోలుకుంటారు! సమత మాటలు పూర్తి కాలేదు.

పెద్దాయన కళ్ళల్లో మెరిసిన మెరుపు.. అదే ముగింపు..!!

COMMENTS